లోక్‌సత్తా పార్టీ

# “రాజకీయాల గౌరవాన్ని పెంచి జనం బాట పట్టించిన లోక్‌సత్తా”

# లోక్‌సత్తా పార్టీ @ 5

*__పుట్టుకతో__ కుల, మత, ప్రాంత, భాష, లింగ, ఆర్థిక వివక్షలేవీ లేకుండా ప్రతి బిడ్డా ఏ రంగంలోనైనా తన సామర్థ్యం మేర వికసించి తలెత్తుకుని సంతోషంగా జీవించేలా చేసే నూతన రాజకీయ వ్యవస్థను అందించటమే మౌలిక లక్ష్యంగా లోక్‌సత్తా పార్టీ అక్టోబర్ 2, 2006న ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. పార్టీ నినాదం, విధానాలు, జెండా, ప్రణాళిక, రాజకీయ సంస్కృతి, పంథా అన్నీ ప్రజల్ని ప్రభువులుగా, ఎవరి జీవితంలో వాళ్లనే హీరోలుగా చేయటమనే లక్ష్య సాధన దిశగానే ఉంటాయి. “నిరాహారదీక్ష వంటి పంథాలో, లోక్‌పాల్ వంటి ఓ చట్టం కోసం పోరాటం చేయటం వల్లే భారతదేశం మారిపోతుందనుకోవటం తొందరపాటుతనం, అవగాహనారాహిత్యమే అవుతుంది. సమూల మార్పు రావాలంటే ఈ దేశం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల మీద దీర్ఘకాలిక పోరాటం చేయాలి. అలాంటి దీర్ఘకాలిక, బహుముఖ పోరాటం ద్వారానే రెండో స్వాతంత్ర్యం సాధ్యమవుతుంది” అని భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకూ ఈ దేశంలోని మార్పులను ప్రత్యక్షంగా చూస్తున్న ఓ విఖ్యాత పాత్రికేయుడు ఇటీవల ఓ కాలమ్‌లో అభిప్రాయపడ్డారు. అలాంటి నిజమైన రెండో స్వాతంత్ర్య పోరాటం చేస్తున్న ఉద్యమం, పార్టీ భారతదేశంలో ఏ ప్రమాణాల ప్రకారం చూసినా లోక్‌సత్తా ఒక్కటే అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. భారతదేశ ఆత్మ కోసం చేస్తున్న దీర్ఘకాలిక రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా. 2011, అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీ ఐదేళ్లు పూర్తిచేసుకుని ఆరవ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌తో మొదలు పెట్టి __దేశవ్యాప్తంగా మార్పు తీసుకొచ్చేందుకు లోక్‌సత్తా పార్టీ ఓ చారిత్రక అవసరంగా తన పోరాటాన్ని ప్రారంభించింది.__*

**రాష్ట్రంలో** పాతుకుపోయిన రెండు బలమైన సాంప్రదాయ పార్టీల మధ్య, తీవ్ర ఘర్షణ వాతావరణం, ప్రతికూల పరిస్థితుల మధ్య లోక్‌సత్తా పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగుతోంది. కొందరు నేతలు, వారి కుటుంబాలు, వారసుల చుట్టూ తిరుగుతున్న ధన రాజకీయానికి అర్థం మార్చి, రాజకీయాలకు గౌరవాన్ని, విశ్వసనీయతను పెంచి జనం బాట పట్టించిన ఘనత లోక్‌సత్తాదే. ఎన్నికలు నేతలు, పార్టీల కోసమా? లేక ప్రజల కోసమా? అనే ప్రశ్నను లేవనెత్తి ప్రజల పక్షాన లోక్‌సత్తా పోరాటం చేస్తోంది. రాజకీయమంటే రోజువారీ జీవితానికి అతీతమైనది, నేతలు దైవదూతలు అనే సాంప్రదాయ రాజకీయ పార్టీల ధోరణిని, అభిప్రాయాలని చెల్లాచెదురు చేసింది. ఎటువంటి త్యాగాలూ చేయాల్సిన అవసరం లేకుండా ప్రజలు తమ కోసం, తమ బిడ్డల భవిష్యత్తు కోసం తమ నిత్యజీవితంలో నిజాయితీ గల రాజకీయాన్ని ఓ భాగంగా గుర్తించి ఎక్కడికక్కడ భాగస్వాములయ్యేలా, అవకాశమున్నవారు నాయకత్వాన్ని అందించేలా నూతన రాజకీయ సంస్కృతిని లోక్‌సత్తా తీసుకొచ్చింది. ఇలా ప్రకృతి సూత్రాల ప్రాతిపదికన రాజకీయాల్ని రోజువారీ జీవితంలో ఓ భాగంగా, వికసిత, సమగ్ర జీవనశైలిగా అందించిన తొలి పార్టీ లోక్‌సత్తా. లోక్‌సత్తా పార్టీ ఐదేళ్ల ప్రస్థానాన్ని, నిశ్శబ్ద ప్రభావాన్ని గణించటం, ఒడిసిపట్టటం సాధ్యం కాకపోయినా, కొన్ని ప్రధాన విభాగాల పరిధిలో ఆ వివరాలను విహంగ వీక్షణంగా వివరించేందుకు చేస్తున్న ప్రయత్నమిది.

జనం చేతికి అధికారాన్నిచ్చేందుకు ప్రత్యామ్నాయ విధానాలతో పనిచేసే లోక్‌సత్తా పార్టీ ఉండటం వల్ల రాజకీయాల్లో ఎంత మార్పు ఉంటుందో ప్రస్ఫుటంగా చూపించిన సంవత్సరం 2010–11. ఏ అంశాలను, విధానాలనైతే రాష్ట్రంలో, దేశంలో పార్టీలు చేపట్టకపోవటంతో లోక్‌సత్తా ఉద్యమం లోక్‌సత్తా పార్టీగా మారిందో... ఆ అంశాలు, విధానాలు రాజకీయ ఎజెండాగా మారటం ఈ ఏడాదే మొదలైంది.

"అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలను అందించటాన్ని రాజకీయానికి కేంద్రబిందువు చేసేందుకు పోరాటం కావచ్చు, వ్యవసాయ రంగంలో సమూల సంస్కరణలు కావచ్చు, అధికార వికేంద్రీకరణ-జిల్లా ప్రభుత్వాల ఏర్పాటు కావచ్చు, చిన్న పట్టణాల అభివృద్ధితో గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాన్ని తగ్గించటం కావచ్చు, సమగ్ర జలవనరుల వినియోగం కావచ్చు, న్యాయవ్యవస్థ సంస్కరణలు కావచ్చు, ప్రాంతీయ అసమానతలకి పరిష్కారాలు కావచ్చు, యువతకి ఉపాధి అవకాశాలు కావచ్చు, మద్యనియంత్రణ ఉద్యమం కావచ్చు, అసెంబ్లీలో వాకౌట్ల కన్నా వాదనలే మిన్న అని నిరూపించిన తీరు కావచ్చు, అవినీతి నిర్మూలన కావచ్చు, చట్టబద్ధ పాలన కావచ్చు, సహకార సంఘాలను బలోపేతం చేయటం కావచ్చు, హేతుబద్ధ వాదనలు, హుందాతనంతో బహిరంగ చర్చ ప్రమాణాలు పెంచటం కావచ్చు, రాజ్యాంగ విలువల్ని శిరోధార్యంగా ఆచరణలో చూపటం కావచ్చు, బంద్‌లు, రాస్తా రోకోలు లేకుండా 'సృజనాత్మక ఒత్తిడి' తెస్తూ పోరాటం చేసే పంథా కావచ్చు, విద్వేషాలను రెచ్చగొట్టకుండా పరస్పర విరుద్ధంగా ఉన్న సందర్భాలలో కూడా అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే సమగ్ర రాజకీయ దృక్పథం కావచ్చు, జనాన్ని ప్రలోభాలతో తరలించకుండా బహిరంగ సభల్ని నిర్వహించటం కావచ్చు, అందరికీ ఎదిగే అవకాశాల దిశగా రిజర్వేషన్ల విధానం కావచ్చు, ఓటరు నమోదు, దామాషా పద్ధతి సహా ఎన్నికల సంస్కరణల కోసం నిరంతర కృషి కావచ్చు, ఎన్నికలలో డబ్బు, మద్యం పంపిణీ లేకుండా పోరాటం కావచ్చు, నేతల వారసులకి కాకుండా అర్హులైన సామాన్య, మధ్యతరగతి, బలహీనవర్గాల ప్రజలకు ఎన్నికలలో టికెట్లు ఇవ్వటం కావచ్చు, పార్టీ నిర్మాణంలో అంతర్గత ప్రజాస్వామ్యం కావచ్చు, పార్టీలో అన్ని వర్గాలకూ ప్రజాస్వామ్యబద్ధంగా ప్రాధాన్యత కల్పించటం కావచ్చు, పార్టీ నిధుల సమీకరణ, వ్యయంలో పారదర్శకత, జవాబుదారీతనం కావచ్చు, రాజ్యాంగబద్ధత, లౌకికత, జాతీయతా దృక్పథం, నైతికత ప్రమాణాలను పాటించటం కావచ్చు, దేశ ప్రయోజనాల కోసం ఏ పార్టీతో నైనా, ఏ పౌరసమాజ సంస్థతోనైనా రాజకీయాలకతీతంగా కలిసి పనిచేసే విశాల దృక్పథం కావచ్చు, అధికారాన్ని లక్ష్యంగా కాకుండా లక్ష్యసాధనకు ఓ మార్గంగా చూసే పంథా కావచ్చు, ప్రజాస్వామ్యబద్ధంగా చర్చల ద్వారా పరిష్కారానికి కృషి చేయటం కావచ్చు, మౌలికాంశాలపై రాజీపడకుండా అందరి అభిప్రాయాలకూ అవకాశం కల్పించే ప్రజాస్వామ్య ధోరణి కావచ్చు... కేవలం లోక్‌సత్తా ఉండటం వల్లే ఈ వ్యవస్థీకృత మార్పులు మొదలయ్యాయి. ఇవ్వాళ ఆయా అంశాల్లో ప్రజలకు వాస్తవాలు అర్థమవుతూ సరైన దిశగా బలమైన చర్చ, డిమాండ్లు ముందుకొస్తున్నాయి. రాజకీయ ప్రయోజనాలు కాకుండా ప్రజాప్రయోజనాల ప్రాతిపదికన ఏ అంశం మీదైనా స్పందించి ప్రజల మద్దతు కూడగట్టే పార్టీగా కొత్త రాజకీయానికి లోక్‌సత్తా చిరునామాగా మారింది".

**వ్యవస్థ ప్రక్షాళన జరగాలి, విధానాలు మారాలి, పాలనా, ఎన్నికల రంగాలలో సమూల సంస్కరణలు రావాలి, అధికార వికేంద్రీకరణ జరగాలి, అవినీతిపరులు ఎంతటివారైనా జైళ్లలోకి పంపించి వారి ఆస్తుల్ని జప్తు చేసే బలమైన చట్టం రావాలి, విద్య-వైద్యం-ఉపాధి అవకాశాలకు పెద్దపీట వేయాలి, రాజకీయ నేతలకు నైతిక విలువలు కావాలి, రాజ్యాంగ విలువలకు కట్టుబడాలి, పార్టీల నిర్మాణం తీరు మారాలి, బంద్‌లు, విధ్వంసాలతో చివరికి మనకే నష్టం, వ్యవస్థల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీదా ఉంది... ఈ రోజు పార్టీలకతీతంగా నేతలు, పౌరసమాజం ప్రతినిధులు, వివిధ వర్గాలు, మీడియా జపిస్తున్న ఈ మాటలు ఎవరివి? లోక్‌సత్తా ఓ ఉద్యమంగా దాదాపు 15 ఏళ్లుగా, ఓ రాజకీయ పార్టీగా ఐదేళ్లుగా చెబుతున్న మాటలు, చేస్తున్న వాదనలే ఇవి.** ఉద్యమంగా, పార్టీగా లోక్‌సత్తా చేస్తున్న కృషే ఈ అంశాల చుట్టూ ముడిపడి ఉంది. ఈవేళ అవే ప్రధాన స్రవంతి మాటలుగా మారిపోయాయి. వీటన్నిటిపై లోక్‌సత్తా ఉద్యమంగా ఉన్నప్పుడు పెదవి విరిచిన మిగిలిన పార్టీలు కూడా ఇప్పుడు రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటుండటం వల్ల విధిలేని పరిస్థితుల్లో ప్రస్తుతానికి పైపైన అయినా లోక్‌సత్తా పార్టీని అనుసరించాల్సి వస్తోంది.

**లోక్‌సత్తా పార్టీ కృషిని, ప్రభావాన్ని ఇప్పుడు ప్రధాన విభాగాల పరిధిలో స్థూలంగా పరిశీలిద్దాం...**

### 1. అవినీతి నిర్మూలనకు బహుముఖ పోరాటం

1997లో లోక్‌సత్తా ఉద్యమం ప్రారంభం నాటి నుంచి అవినీతిపై చేస్తున్న బహుముఖ పోరాటాన్ని పార్టీగా రూపుదిద్దుకున్నాక రాజకీయంగా కూడా లోక్‌సత్తా కొనసాగించింది. సీబీఐ, ఏసీబీల నేరపరిశోధనా విభాగాలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని, రాజకీయ, ఉన్నతస్థాయి అధికారుల అవినీతి కట్టడికి హాంకాంగ్ తరహాలో స్వతంత్ర ప్రతిపత్తి గల అవినీతి నిరోధక కమిషన్ (ఐఏసీసీ)ను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలతో ప్రజల్ని చైతన్య పరిచే కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగించింది.

డిసెంబర్ 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం జరపటం ప్రారంభించిన పార్టీ దేశంలో లోక్‌సత్తా మాత్రమే. ఇప్పుడు అవినీతిపై ప్రజలలో కాస్త చైతన్యం కనిపిస్తుండటంతో అన్ని పార్టీలూ ఆ బాటలోకి వస్తున్నాయి. అవినీతికి నిర్వచనాన్ని విస్తరించటం దగ్గర్నుంచి అవినీతి నిర్మూలనకు పకడ్బందీ చర్యల వరకూ ప్రజల్ని చైతన్యం చేయటం, ప్రభుత్వంపై ఒత్తిడి తేవటం కోసం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా, దేశంలో బెంగళూరు, చెన్నై, భోపాల్ వంటి ప్రధాన నగరాలలో కూడా పార్టీ కార్యక్రమాలను నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో జలయజ్ఞంలో అక్రమాలపై, అసంబద్ధ పథకాలపై గట్టిగా పార్టీ గళం విప్పింది. రాష్ట్రంలో 348 కిలోమీటర్ల మేర తీర ప్రాంతాన్ని నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వం కేవలం మూడు సంస్థలకే ధారాదత్తం చేసిన భారీ అక్రమాల్ని సాక్ష్యాధారాలతో సహా బైటపెట్టి అసెంబ్లీలో నిలదీసింది.

2 జీ స్పెక్ట్రం కుంభకోణంలో దోషులపై చర్యలతోపాటు ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టాన్ని వారి నుంచి తిరిగి రాబట్టాలని, విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ పన్నును విధించాలని ప్రధానమంత్రి కార్యాలయానికి పోస్టుకార్డులతో, మనియార్డర్లతో పెద్దఎత్తున ఉద్యమం చేసింది. 2009లో పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కూకట్‌పల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నిక య్యాక అవినీతి నిరోధక చట్టాన్ని సవరించి, లోకాయుక్తను బలోపేతం చేసేలా పటిష్టమైన బిల్లును అసెంబ్లీ స్పీకర్‌కి, అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం సహా అన్ని పార్టీల నేతలకూ అందించారు. ఈ బిల్లును చట్టం చేసి రాష్ట్రంలో అవినీతిని అంతం చేసేందుకు సహకరించాలని అందరినీ కోరారు. కానీ అటు కాంగ్రెస్, ఇటు తెలుగుదేశం స్పందించలేదు. ఈవేళ లోక్‌పాల్‌లో ఉన్న అంశాలన్నీ దాదాపుగా ఆ బిల్లులోని తీరుగానే ఉన్నాయి. ఏసీబీని బలమైన లోకాయుక్తతో సంధానం చేయటం, రాజకీయ నేతల, ఉన్నత స్థాయి ఉద్యోగుల అవినీతి ఫిర్యాదుల్ని విచారించేందుకు జిల్లాల్లో సైతం ప్రత్యేక కోర్టుల్ని ఏర్పాటు చేయటం, స్వతంత్ర ప్రాసిక్యూషన్‌తో విచారణ జరిపి, నేరం రుజువైతే వారిని జైళ్లకు పంపటంతోపాటు వారి ఆస్తుల్ని జప్తు చేయటం ఇందులో భాగంగా ఉన్నాయి.

ఇవే ఏర్పాట్లతో జాతీయ స్థాయిలో ఐఏసీసీ లేదా లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని 2010లో ప్రధానికి జేపీ సవివరంగా లేఖను కూడా రాశారు. ఆ తర్వాత లోక్‌పాల్ కోసం జాతీయస్థాయిలో పౌరసమాజం, మీడియా నుంచి గట్టి ఒత్తిడి వచ్చి ఉద్యమరూపం దాల్చింది. దీనికి లోక్‌సత్తా కూడా గట్టి మద్దతునిచ్చి అండగా నిలబడింది. అయితే బలమైన లోక్‌పాల్ కోసం కాకుండా *ప్రభుత్వ లోక్‌పాల్ వర్సెస్ పౌరసమాజం లోక్‌పాల్* అనే రీతిలో చర్చ పక్కదోవ పట్టటంతో సమగ్రమైన, అర్థవంతమైన లోక్‌పాల్ కోసం మళ్లీ లోక్‌సత్తా పార్టీయే చొరవ తీసుకుని ఏప్రిల్ 24, 2011న ఢిల్లీలో జాతీయస్థాయి పౌరసమాజ ప్రముఖులతో, ఆగస్టు 11, 2011న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ప్రముఖులతో రౌండ్‌టేబుల్ సమావేశాల్ని నిర్వహించింది. దాదాపు 18 కీలకాంశాలపై ఏకాభిప్రాయాన్ని సాధించింది. 80-90శాతం పాలన, అవినీతి రాష్ట్రాలు, జిల్లాల స్థాయిలోనే ఉంటుంది కాబట్టి కేవలం జాతీయస్థాయికే లోక్‌పాల్ పరిమితమైతే సరిపోదని, రాష్ట్రాలలో అదేరీతిలో లోకాయుక్తల్ని, జిల్లాలలో స్థానిక ప్రభుత్వాలకు అంబుడ్స్‌మన్‌లను కూడా ఆర్టికల్ 253 కిందఏర్పాటు చేయాలని లోక్‌సత్తా చాలా కీలకమైన డిమాండ్‌ను లేవనెత్తింది. ఇందుకోసం 10 లక్షల సంతకాల సేకరణను చేపట్టటంతోపాటు ఆ అంశంపై జనచైతన్యం కోసం జేపీ తొలివిడతగా రాష్ట్రంలోని 9 జిల్లాలలో లోక్‌పాల్ రథయాత్రను నిర్వహించారు. తర్వాత అన్నా హజారే బృందం సహా అందరూ దీనికి మద్దతునిచ్చారు.

బలమైన లోక్‌పాల్ కోసం లోక్‌సత్తా ఏకాభిప్రాయం సాధించి చేసిన సిఫార్సుల్ని పార్ల మెంటు పరిగణలోకి తీసుకుంటుందని ప్రధానమంత్రి డా॥ మన్మోహన్ సింగ్ ఆగస్టు 27, 2011న లోక్‌సభలో ప్రకటించారు. ఉన్నత న్యాయవ్యవస్థను లోక్‌పాల్‌లో చేర్చకూడదని, దీనికి ప్రత్యేకమైన ఏర్పాటు ఉండాలన్న లోక్‌సత్తా వాదనకు, లోక్‌సత్తా చొరవతో రూపొందిన జాతీయ జ్యుడిషియల్ కమిషన్‌కు కాంగ్రెస్, బీజేపీ సహా అన్ని పార్టీలూ పార్లమెంటులో మద్దతు పలికాయి. ఇది త్వరలో సాకారం కాబోతోంది. అలాగే కేవలం లోక్‌పాల్ సర్వరోగనివారిణి కాదని, ఎన్నికల, పాలనా సంస్కరణల్ని, పార్టీల పనితీరును సమూలంగా మార్చటం అవసరమని లోక్‌సత్తా స్పష్టంచేసింది. అందుకే కేవలం లోక్‌పాల్, లోకాయుక్త, అంబుడ్స్మ మన్‌ల ఏర్పాటు కోసమేకాకుండా అధికారాన్ని వికేంద్రీకరించి జనం చేతికివ్వటం కోసం గట్టి పోరాటం చేస్తుండటమే కాకుండా పార్టీ నిధుల సేకరణ, వ్యయం, ఎన్నికల ఖర్చును తదితర వివరాలన్నిటినీ ఆడిట్ చేసి పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజల ముందు ఉంచు తోంది. అవినీతి నిరోధానికి రాజకీయంగా బహుముఖ పోరాటాన్ని ఆచరణలో చూపుతోంది.

### 2. వ్యవసాయానికి విముక్తి

పంటలు బాగా పండినా, మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నా రైతు నోట్లో మన్ను కొట్టి వారికి ఎటువంటి పరిస్థితుల్లోనూ లాభసాటి ధర రాకుండా వరుసగా కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థ చేస్తున్న దుర్మార్గపు మోసాన్ని లోక్‌సత్తా పార్టీ

ఎండగట్టింది. రైతుకు భద్రత లేకుండా దేశానికి ఆహారభద్రత ఉండదని స్పష్టంచేసింది. పైకి రైతేరాజు, రైతు ప్రభుత్వం వంటి నినాదాలిస్తూ, రైతులెప్పుడైనా ఆందోళనలకు దిగుతారు అనుకుంటే వడ్డీ, రుణ మాఫీలు, తాత్కాలిక రాయితీల మీదే ప్రభుత్వాలు, పార్టీలు ఇప్పటిదాకా దృష్టి పెడుతూ వచ్చాయి. రైతులు ఎప్పటికీ ఎదగకుండా తమ మోచేతి నీళ్లు తాగే బిచ్చగాళ్లుగా చేసే విధానాలనే వీరు అమలు చేస్తూ వచ్చారు. 2008లో యూపీయే ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీ వల్ల రైతులు దీర్ఘకాలికంగా అప్పులు కూడా దొరకని దుస్థితిలోకి వెళ్తారని, దానికి బదులు వ్యవసాయానికి సరైన ధర వచ్చేందుకు ఒక నిధిని ఏర్పాటు చేసినా మంచి ఫలితాలు వచ్చేవని ఆరోజున ఖండించిన పార్టీ యావత్ దేశంలో లోక్‌సత్తా ఒక్కటే. ఆ తర్వాత గణాంకాలు లోక్‌సత్తా వాదనే నిజమని రుజువు చేశాయి. ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా కొన్నేళ్లుగా పంటలు ఇబ్బడిముబ్బడిగా పండినా రైతులలో 82 శాతం మంది అప్పుల ఊబిలో కూరుకు పోయారని, బలహీన వర్గాలు ఎక్కువగా ఉన్న కౌలుదారుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందని, కేవలం పాలకుల పాపం వల్లే తప్ప ప్రకృతి శాపం వల్లే రైతులు నష్టపోవటం లేదని తొలిసారిగా లోక్‌సత్తా వెలుగులోకి తెచ్చింది. గ్రామాలలో వ్యవసాయరంగంలో ఉన్న పాపానికి తలసరి ఆదాయం రూ. 16,000 ఉంటే, పట్టణాలలో వ్యవసాయేతర రంగాలలో ఉన్నవారికి అంతకు ఏడు రెట్లు ఎక్కువగా రూ. 1,12,000 దాకా ఉందని తేల్చిచెప్పింది. రైతుల్ని కేవలం పరిశ్రమలకు ముడిసరుకులు అందించే యంత్రాలుగా చూశారు తప్ప రక్తమాంసాలున్న మనుషులుగా చూడలేదని గల్లీ నుంచి ఢిల్లీ వరకూ లోక్‌సత్తా గళం వినిపించింది. **లైసెన్స్ రాజ్యాన్ని అంతం చేసి స్వేచ్ఛావాణిజ్య సంస్కరణలు తెచ్చి వ్యవసాయాన్ని లాభసాటి చేసి గ్రామీణ ఆర్థికవ్యవస్థను బాగుచేసి తద్వారా దేశాన్ని స్థిరమైన అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రాజకీయాలకు అతీతంగా ప్రారంభించిన 'రైతు ఐక్యతా ఉద్యమం' పెద్దఎత్తున విజయవంతమైంది.** కులం, ప్రాంతం, పార్టీలు, పంటల పేరుతో విడిపోయి ఉన్న ధాన్యం, పత్తి, చెరకు, ఆయిల్ పామ్, పసుపు, మొక్కజొన్న, మిర్చి, బత్తాయి తదితర పంటల రైతుల్ని, కౌలుదారుల్ని ఏకం చేసి వ్యవసాయాన్ని లాభసాటి చేయటమనే లక్ష్యం దిశగా లోక్‌సత్తా నడిపించింది.

రాష్ట్రంలోని కోస్తాంధ్ర, తెలంగాణ, రాయలసీమతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో కూడా జేపీ పర్యటించి రైతునేతల్ని, పార్టీల్ని సమీకరించి జాతీయస్థాయిలో పోరాటాన్ని ప్రారంభించారు. లోక్‌సత్తా వాదన రాష్ట్రంలోని రైతుల్లోకి, ప్రజల్లోకి బలంగా వెళ్లింది. జాతీయ స్థాయిలోని స్వతంత్ర రైతుసంఘాలు, ఆలోచనాపరులు కూడా గళం కలిపారు. రాష్ట్రంలో ఇక తప్పనిసరి పరిస్థితుల్లో పాలకులు, రాజకీయ పార్టీలు కదిలాయి. బాబ్బాబూ అంటూ కాసిని రాయితీల కోసం కాకుండా విధానాలను చూపుతూ తమకు న్యాయంగా, హేతుబద్ధంగా రావలసిన లాభసాటి ధరను ఈవేళ రైతులు అడుగుతున్నారంటే అది లోక్‌సత్తా పార్టీ కృషి వల్లే.

ఇప్పటికైనా వ్యవసాయానికి సంకెళ్లు తెంచి శాశ్వత ప్రాతిపదికన స్వేచ్ఛావాణిజ్యాన్ని ప్రవేశపెట్టి ఆహారభద్రతకు లోబడి మిగులు ఆహారధాన్యాలను ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ అమ్ముకునే ఏర్పాటు చేయాలని, ఆహారేతర పంటలను నిర్నిబంధంగా ఎప్పుడూ ఎక్కడికైనా ఎగుమతి చేసుకునే ఏర్పాటు చేయాలని, నిల్వ ఉండని వ్యవసాయోత్పత్తులకు పెద్దఎత్తున శీతల గిడ్డంగులను నిర్మించి ధర ఉన్నప్పుడు అమ్ముకునే ఏర్పాటు చేయాలని, వ్యవసాయాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేసి అటు వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలని, గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అంతరం తగ్గించాలని గణాంకాల సహి తంగా స్థానిక ఎమ్మెల్యేల నుంచి ప్రధానమంత్రి వరకూ జేపీ కాలికి బలపం కట్టుకుని తిరిగి వినిపించారు. ప్రధానంగా లోక్‌సత్తా కృషి వల్లే ఎటువంటి నిబంధనలూ లేకుండా బాస్మతీయే తర బియ్యం ఎగుమతులకు సెప్టెంబర్, 2011లో కేంద్రప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆహార ధాన్యాల ధరల పెరుగుదల వల్ల ఆహార ద్రవ్యోల్బణం రావటంలేదని, గుడ్లు, మాంసం తదితర ఉత్పత్తుల ధరల వల్లే ద్రవ్యోల్బణం పెరుగుతోందని, రైతుకు రేటు వస్తే వినియోగదారులు నష్టపోతారని చేస్తున్న తప్పుడు వాదనల్ని లోక్‌సత్తా తుత్తునియలు చేసింది.

అయితే సాంప్రదాయ రాజకీయ పార్టీల్లాగా తాత్కాలికంగా రాజకీయ లబ్ది కోసం పోరాటం చేసే ధోరణితో కాకుండా వ్యవసాయానికి సంకెళ్లు పూర్తిగా తెంచేందుకు రాజకీయాలకు అతీతంగా దీర్ఘకాలిక, మౌలిక సమస్యల మీద రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోరాటం కీలకమని భావించిన లోక్‌సత్తా... ఆ దిశగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోంది.

### 3. ప్రభుత్వాలను వికేంద్రీకరించి జనం చేతికి అధికారం ఇవ్వడం

కేంద్రీకృత పాలనావ్యవస్థ పెద్దఎత్తున అవినీతిని పెంచటమేకాకుండా, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాస్తూ ప్రజల్ని యాచకులుగా కొనసాగిస్తుందని లోక్‌సత్తా పార్టీ గట్టిగా వాదించింది. స్థానిక ప్రభుత్వాలకు అధికారాల్ని, నిధుల్ని బదిలీ చేయాలని లోక్‌సత్తా ఉద్యమం కోటీ 8 లక్షల సంతకాలను సేకరించినప్పుడు తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు

నాయుడు, ప్రతిపక్షనేత వైఎస్ రాజశేఖర రెడ్డి మాటతప్పి, తమ పాలనలో అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. కేంద్రీకృత పాలనతో, ప్రజల్ని బిచ్చగాళ్లుగా కొనసాగించే తప్పుడు అభివృద్ధి నమూనాతో అవినీతికి పెద్దఎత్తున తలుపులు తెరిచారు. ఈవేళ ప్రాంతీయ అసమానతల పేరుతో అన్నకు, తమ్ముడికి మధ్య చిచ్చు పెట్టే పరిస్థితికి కారకులయ్యారు. బలమైన స్థానిక ప్రభుత్వాల కోసం 2006 దాకా ఉద్యమంగా పోరాడిన లోక్‌సత్తా... పార్టీగా అధికార వికేంద్రీకరణను రాజకీయ ఎజెండాగా మార్చింది. నిధులు, విధులతో జిల్లా ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలని, మున్సిపల్/ కార్పొరేషన్, మండల, గ్రామపంచాయతీలను బలమైన స్థానిక ప్రభుత్వాలుగా తీర్చిదిద్దాలని పోరాటం ప్రారంభించింది. 2009 అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా 1000 చిన్నపట్టణాలను అభివృద్ధి చేసి యువతకు స్థానికంగానే కనీసం 50 లక్షల ఉద్యోగాలను అందిస్తామని నిర్దిష్టమైన హామీనిచ్చింది. అలాగే అదే ఏడాది జరిగిన గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో (ఈ ఎన్నికలు కూడా లోక్‌సత్తా పిటిషన్‌తో కోర్టు జోక్యం చేసుకుని హెచ్చరించటంతో జరిగాయి) వార్డు ప్రభుత్వాలను ఏర్పాటు చేసి తలసరి ప్రతి పౌరునికీ కనీసం రూ.1000 కేటాయించి ప్రజలు ఎన్నుకున్న కమిటీ ద్వారానే ఆ డబ్బు స్థానికాభివృద్ధికి ఖర్చు చేసుకునేలా అన్ని వార్డులకూ వార్డు మేనిఫెస్టోను ప్రకటించింది. దీనికి ప్రజల్లో అద్భుత స్పందన వచ్చింది. వార్డుకు వచ్చే ఆదాయం, సమస్యలు, పరిష్కార మార్గాలు, పరిష్కరించటానికి లోక్‌సత్తా ఎంత సమయం తీసుకుంటుంది మొదలైన వివరాలన్నిటినీ ప్రజల మధ్యే వారి అభిప్రాయాలతో తయారుచేసి వార్డు మేనిఫెస్టోలను పార్టీ రూపొందిం చింది. అలాగే గ్రామంలో ఒకరోజు కార్యక్రమం పేరుతో కొన్ని ఎంపిక చేసిన గ్రామాలకు కూడా వెళ్లి స్థానిక మేనిఫెస్టోలను ప్రజల భాగస్వామ్యంతో రూపొందించేందుకు కృషి చేసింది. ఇందుకోసం సురాజ్య ఉద్యమాన్ని చేపట్టింది. రాబోయే మున్సిపల్, పంచాయతీ ఎన్నికలలో ఈ స్థానిక పాలన భావనను పెద్దఎత్తున తీసుకెళ్లేందుకు పార్టీ సన్నద్ధమవుతోంది. అలాగే ప్రజలకు తలసరి రూ.1000 ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో నేరుగా 10శాతం ఇవ్వాలనే డిమాండ్‌తో జేపీ కొందరు జాతీయస్థాయి నేతలతో కలిసి జంతర్ మంతర్ వద్ద బైఠాయింపు కార్యక్రమం కూడా జరిపారు. ఇలా కేటాయించడం వల్ల వెయ్యి మంది జనాభా ఉన్న గ్రామానికి ఏటా రూ.10 లక్షలు వస్తాయి. స్థానిక సమస్యలను ఎవరి మీదా ఆధారపడకుండా పరిష్కరించుకోవచ్చు. పరిపాలన, ప్రజాస్వామ్యం పరిపుష్టమవుతాయి. కేంద్రీకృత పాలనతో రాష్ట్రంలో ప్రాంతీయ విద్వేషాలకు దారితీసే పాలన చేసిన నేతలే ఇప్పుడు అధికార వికేంద్రీకరణ గురించి మాట్లాడుతున్నారంటే, అది లోక్‌సత్తా కృషే.

### 4. నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి నైపుణ్యాలు, పేదరిక నిర్మూలనను రాజకీయానికి కేంద్రబిందువు చేయటం

రాజకీయాన్ని వ్యాపారంగా, పార్టీల్ని సొంత ఆస్తులుగా మార్చి తమ వారసులు, కుటుంబసభ్యులు మాత్రమే ఎదగటానికి ఉపయోగించుకుంటున్న సాంప్రదాయ రాజకీయ పార్టీలు ఎక్కడ ప్రజలు తమ కాళ్ల మీద నిలబడి తలెత్తుకుని బతికితే తమను ప్రశ్నిస్తూ తమ దోపిడీకి అంతం పలుకుతారోనని పేదరికాన్ని నిరంతరం కొనసాగించే విధానాలను అనుసరిం చాయి. ఇందులో భాగంగానే మంచి పాఠశాల విద్యను, మంచి వైద్యాన్ని ప్రజలకు అందించ కుండా, సరైన ఉపాధి నైపుణ్యాలను వారికి అందించకుండా, స్థానికంగా ఉపాధి అందుబాటు లోకి తేకుండా చేశాయి. ప్రజలను శాశ్వత బిచ్చగాళ్లుగా కొనసాగించేందుకు పోటాపోటీగా తాయిలాలను ప్రకటిస్తూ వచ్చాయి. ఆ పార్టీల ఎన్నికల హామీల నిండా ఇలాంటివే. చివరికి ఇంటికో బంగారు గొలుసును, ప్రతి నెలా ఇంటింటికీ ఐదారు బ్రాందీబాటిళ్లను ఉచితంగా సరఫరా చేస్తామన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. దాదాపు 27ఏళ్ల క్రితం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన కిలో బియ్యం రూ. 2 పథకానికి సబ్సిడీని పెంచుతూ ఇంకాఇంకా విస్తరిస్తూ పోతున్నామంటే, ఇన్నేళ్ల పాలకులూ అనుసరించింది పేదరికాన్ని కొనసాగించే విధానాలు కాదా? రాష్ట్ర జనాభా కంటే ఎక్కువగా తెల్లకార్డుల్నిచ్చి ప్రజలకు కాసిని తాయిలాల్ని పడేస్తూ, తాము మాత్రం వందల, వేల కోట్ల రూపాయలను దోచేస్తున్నారు. తెల్లకార్డు రాయితీల కోసం తాము కూడా అవినీతికి పాల్పడ్డామేమోనన్న అపరాధ భావనలోకి ప్రజల్ని నెట్టేస్తే ఇక తమల్ని ఇప్పట్లో ఎవరూ ప్రశ్నించేవారుండరని పాలకులు భావించే పరిస్థితి నెలకొంది.

తాత్కాలిక ఉపశమనాన్నిచ్చే తాయిలాలను శాశ్వతంగా ఏదోకరూపంలో కొనసాగించటం తప్ప... విద్యను, ఆరోగ్యాన్ని, ఉపాధి నైపుణ్యాలు ఉచితంగా ఇస్తామని పొరపాటున కూడా ఏ పార్టీ ప్రకటించలేదు. 12వ తరగతి వరకూ మంచి ప్రమాణాలు గల పాఠశాల విద్యను ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా అందరికీ అందిస్తామని ఇన్నేళ్ల రాష్ట్ర, దేశ చరిత్రలో ఒక్కటంటే ఒక్క పార్టీ కూడా ప్రకటించలేదు. మంచి చదువు లేకుండా తాయిలాలతో పేదరికం, పుట్టుకతో వివక్షలు ఎలా పోతాయో ఆ పార్టీలకు, నేతలకే ఎరుక. ప్రజల్ని వారి కాళ్ల మీద నిలబెట్టి తలెత్తుకుని బతికేలా చేసేందుకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి నైపుణ్యాలను రాజకీయానికి కేంద్ర బిందువు చేయటం ద్వారా సా.రా పార్టీలకు లోక్‌సత్తా పెనుసవాలు విసిరింది.

2006లో లోక్‌సత్తా పార్టీ తన విద్య, వైద్య విధానాలు ప్రకటించాక ప్రజల్లో ఆలోచన పెరగటాన్ని గమనించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అందులో నుంచి కొన్ని ముక్కలు తీసుకుని ఫీజు రీఇంబర్స్‌మెంట్ పథకాన్ని, ఆరోగ్యశ్రీని చేపట్టారు. అయితే ఇవి ప్రజల్ని మభ్యపెట్టేవే తప్ప సరిపోవని, ప్రతి బిడ్డకూ కులం,మతం, ఆర్థిక నేపథ్యంతో సంబంధంలేకుండా 12వ తరగతి వరకూ నాణ్యమైన చదువును ఉచితంగా అందించాలని, ఆ పైన చదువుకోవాలంటే పేదరికం కారణంగా ఎవరి చదువూ ఆగకుండా ప్రభుత్వమే సాయం చేయాలని లోక్‌సత్తా పోరాడుతోంది. ఇప్పుడిప్పుడే ఈ దిశగా ప్రభుత్వాలు కదులుతున్నాయి. అలాగే ఆరోగ్యశ్రీ పరిమితిని, ప్రచారమోసాన్ని ఎండగట్టింది ఒక్క లోక్‌సత్తా పార్టీ మాత్రమే. ఆరోగ్యశ్రీపై బహిరంగచర్చకు సిద్ధమా అన్న వైఎస్ రాజశేఖరరెడ్డి సవాలును లోక్‌సత్తా స్వీకరిం చింది. ఆరోగ్యశ్రీ పై ప్రభుత్వం చేస్తున్న ప్రచారం బూటకమని పలు మీడియా చర్చల్లో లోక్ సత్తా కుండబద్దలు కొట్టిచెప్పింది. కేవలం కొన్ని జబ్బులకు, కొద్దిమందికి, కొన్ని ఆసుపత్రు లలో, అది కూడా జబ్బు బాగా ముదిరాక వర్తించే ఆరోగ్యశ్రీ వల్ల పెద్దగా ఫలితం ఉండదని, అది కార్పొరేట్ ఆసుపత్రులకు లబ్ధి చేకూర్చే పథకం మాత్రమేనని, అందరికీ, అన్ని ఆసుపత్రులలో, అన్ని జబ్బులకూ, నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో ఉచితంగా అందించాలని ప్రజల్ని చైతన్యపరిచింది. ఆ మాటల్నే ఈవేళ అందరూ అంగీకరించి ప్రభుత్వాసుపత్రులను బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే యువతకు ఉపాధిని అందించే నైపుణ్యాల శిక్షణ మీద, చిన్న పట్టణాలను అభివృద్ధి చేసి స్థానికంగా ఉపాధి కల్పించటం మీద లోక్‌సత్తా రాజకీయ చర్చగా మార్చింది. పార్టీ అనుబంధ విభాగం యువసత్తా ద్వారా వివిధ ప్రాంతాలలో ఉపాధి శిక్షణా కార్యక్రమాలను చేపట్టింది. జేపీ ఎమ్మెల్యేగా ఉన్న కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఈ కృషి నిరంతరాయంగా జరుగుతూ వందలాదిమందికి ఇప్పటికే ఉపాధిని కూడా చూపించారు. యువత ఉపాధి నైపుణ్యాల కోసం ఏటా రూ.2500 కోట్ల రూపాయలను కేటాయిస్తే ప్రతి ఏడాదీ 10లక్షలమందికి ఉద్యోగాలు కల్పించవచ్చన్న లోక్‌సత్తా ప్రతిపాదనకు రాష్ట్రప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించి ఆ దిశగా కొన్ని పథకాల్ని ప్రకటిస్తోంది.

### 5. ప్రత్యేక తెలంగాణ అంశం

రాష్ట్రంలో కీలకాంశంగా రూపుదిద్దుకున్న ప్రత్యేక తెలంగాణ అంశంపై బాధ్యతగల రాజకీయ పార్టీగా స్పందించింది లోక్‌సత్తా ఒక్కటేనని చెప్పవచ్చు. లోక్‌సత్తా లేకుంటే సాంప్ర దాయ రాజకీయ పార్టీల (సా.రా పార్టీల) తీరు పూర్తిగా భావోద్వేగాల చుట్టూ తిరుగుతూ ప్రజల మధ్య చిచ్చుపెట్టే తీరుగానే సాగేదనటంలో సందేహం లేదు. దాన్నో సైద్ధాంతికాం శంగానో, భావోద్వేగాలకు సంబంధించిన అంశంగానో లోక్‌సత్తా చూడలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు వల్ల ఉపద్రవం రాదు, అది సర్వరోగ నివారిణి కూడా కాదు. అందువల్ల ఆ అంశం మీద బలమైన అభిప్రాయం అక్కర్లేదు, జాతీయత, హేతుబద్ధత, సామరస్యత ప్రాతిపదికన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటాం అని గత పదేళ్లుగా చేస్తున్న వాదనకే కట్టుబడి ఉండటంతోపాటు ప్రాంతానికోమాట, రోజుకోమాట చెప్పకుండా అన్ని ప్రాంతాలలో పర్యటించి ఈ సమస్య మీద ప్రజల మధ్య విద్వేషాలను చల్లార్చి ఒక సామరస్యపూర్వక పరిష్కారాన్ని వెదికేందుకు కమిటీలను ఏర్పాటు చేసింది. తెలంగాణ ఇస్తే నష్టమేంటి అని కోస్తా, రాయలసీమలలో ప్రశ్నించింది. ప్రభుత్వాల వైఫల్యం వల్ల పేదరికం, ఉపాధి లేకపోవటం, విశృంఖల అవినీతి, స్థానికంగా అధికారాలు, అభివృద్ధి లేకపోవటంతో ప్రజల్లో నెలకొన్న అసంతృప్తే తెలంగాణ ఉద్యమం ద్వారా బట్టబయలైందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నంత మాత్రాన ఈ సమస్యలు పరిష్కారంకావని, ప్రాంతీయ అసమానతలు తొలగటానికి అధికారాన్ని వికేంద్రీకరించి జిల్లా స్థాయి పాలన తేవటం, రాజకీయాల ప్రక్షాళనే పరిష్కారమని తెలంగాణలో తెలియచెప్పేందుకు ప్రయత్నించింది. **రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్రేకా లను రెచ్చగొట్టే కొంతమందికి ఈ హేతుబద్ధమైన వాదన నచ్చక జేపీ మీద సాక్షాత్తూ శాసన సభ ప్రాంగణంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తూ భౌతికదాడికి దిగారు. అయినా లోక్‌సత్తా సంయమనం కోల్పోకుండా ప్రజాప్రయోజనాలే ధ్యేయంగా స్పందించి అందరినీ సమన్వయం చేసేందుకే కృషి చేస్తోంది.** క్రమంగా లోక్‌సత్తా వాదన వైపు మొగ్గుచూపే వారి సంఖ్య అన్ని ప్రాంతాలలో పెరుగుతోంది.

లోక్‌సత్తాకు అధికారం, సంఖ్యాబలం లేకపోయినా తెలంగాణ సహా అన్ని ప్రాంతాల ప్రజల ప్రయోజనాలు కాపాడటానికి శాసనసభలో గట్టిగా గళం విప్పింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు డిమాండ్‌ను అడ్డంపెట్టుకుని విద్వేషాలను రెచ్చగొట్టినవారెవ్వరూ చేయని మేలు తెలంగాణకు లోక్‌సత్తా చేసింది. హైదరాబాద్ ఫ్రీజోన్ కాదని, ఆరవ జోన్‌లో భాగంగానే ఇక్కడ దిగువ స్థాయి పోలీసు సిబ్బంది నియామకాలు జరపాలని, అందుకోసం రాష్ట్రపతి ఉత్తర్వులోని 14 (ఎఫ్) నిబంధనను తొలగించాలని వాదించి అందరినీ ఒప్పించి శాసనసభలో ఏకగ్రీవ తీర్మా నం చేయించింది లోక్‌సత్తాయే. 14 (ఎఫ్) తొలగింపునకు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయటం వల్ల ఫలితం ఉండదని, ఆ క్లాజును తొలగించేలా అసెంబ్లీలో తీర్మానం ద్వారా కేంద్రాన్ని కోరటమే సరైన పరిష్కారమని,

జేపీ ఒక్కరే ఆ అంశంపై జరిగిన అఖిలపక్ష సమావేశంలో నిజాయతీగా మాట్లాడారని టీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఒక బహిరంగసభలో కూడా పేర్కొన్నారు. ఆ అంశం మీద కేంద్రప్రభుత్వం పీటముడులు వేస్తుంటే, అలాంటి అభ్యంతరాలు తగదని, వెంటనే 14 (ఎఫ్)ను రద్దు చేయాలని ప్రధానమంత్రిని లేఖ ద్వారా జేపీ గట్టిగా కోరారు. 14 (ఎఫ్) తొలగించాక సీమాంధ్రలో అపోహలతో ఆందోళనలు ఎదు రైనా లోక్‌సత్తా వెనక్కి తగ్గి మాటమార్చకుండా వారిని ఒప్పించే ప్రయత్నం చేసింది. అలాగే **ఎగుమతుల కోసం లోక్‌సత్తా గట్టిగా పోరాడబట్టే ఈ ఏడాది తెలంగాణలోని పత్తి రైతులకు క్వింటాలుకు రూ.3,000 నుంచి 8,000 వరకు ధర లభించింది. సిద్దిపేట మార్కెట్‌యార్డులో కనీస సదుపాయాలు లేకపోవటం, ఊరికి ఆవల ఉన్న కొత్త మార్కెట్‌యార్డు ప్రారంభానికి నోచుకోకుండా ఉండటం వల్ల పత్తి రైతులు పెద్దపల్లి వరకూ వెళ్తూ అవస్థలు పడుతుంటే, మెదక్ జిల్లా రైతు యాత్రలో ఉన్న జయప్రకాష్ నారాయణ్ వెంటనే ప్రభుత్వంతో, స్థానిక అధికారులతో మాట్లాడి కొత్త యార్డును తెరిపించి రైతులకు కావలసిన ఏర్పాటు కల్పించారు.** రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు రాజ్యాంగవిరుద్ధమని అడ్డుకున్నది లోక్‌సత్తా. గోదావరి జలాల్ని కరీంనగర్ జిల్లా ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తరలించకుండా ఆ నీటిని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లోనే ఉపయోగించి, హైదరాబాద్ తాగునీటికి కృష్ణానది మూడో దశ పథకాన్ని చేపట్టాలని జీహెచ్ఎంసీ పరిధిలోని 24మంది ఎమ్మెల్యేలను సమీకరించి పోరాడుతున్న పార్టీ లోక్‌సత్తా మాత్రమే. గోదావరి జలాలను కృష్ణానదిలోకి మళ్లించి కృష్ణాజలాలను ప్రధానంగా తెలంగాణ, రాయలసీమ జిల్లాల్లోని మెట్టప్రాంతాలకే వినియోగించాలని, రాష్ట్రంలో సమగ్ర జలవనరుల విధానాన్ని రూపొందించి అందరికీ న్యాయబద్ధమైన నీటివాటా వచ్చేలా లోక్‌సత్తా మాత్రమే పోరాడుతోంది.

2009లో కృష్ణా వరదలు వచ్చినప్పుడు ప్రభుత్వ సాయంతో ప్రమేయంలేకుండా లోక్‌సత్తా పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా కేశవరం గ్రామాన్ని దత్తత తీసుకుని అక్కడ తక్షణావసరాల్ని అందించటంతోపాటు స్కూలు నిర్మాణం కూడా చేసింది. కృష్ణా వరద వల్ల భవిష్యత్తులో ఇలా నష్టం వాటిల్లకుండా కనీసం 25లక్షల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా కరకట్టల నిర్మాణం చేయాలని, జాతీయ విపత్తుల సహాయ దళాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని స్వయంగా కలిసి జేపీ కోరాకే కేంద్రప్రభుత్వం ఆ దిశగా స్పందించింది. ప్రధానమంత్రిని జేపీ కలిసి సంక్షోభాన్ని వివరించాకే ధాన్యంకు మద్దతు ధరపై, ఎగుమతులపై అన్ని పార్టీలూ ముందుకు కదిలాయి. దీనివల్లే వరి రైతులకు కొంతైనా రేటు దక్కింది. 2010-11 రబీ సీజన్‌లో మరోసారి చేసిన తన రైతుయాత్రలో తెలంగాణలోని వివిధ మార్కెట్ యార్డులను జేపీ సందర్శించి గోనెసంచులు సహా వివిధ సమస్యలను అధికారులతో, సచివాలయం వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడి ఎక్కడికక్కడ పరిష్కరించి ధాన్యం రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చూశారు. తెలంగాణలో మార్కెట్‌యార్డుల దుస్థితిని, కొన్ని చోట్ల పొలాల్లోనే పంటలు తగలపెట్టుకుంటున్న దారుణ పరిస్థితుల్ని అసెంబ్లీలో జేపీ లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీశారు. పరిష్కారాల దిశగా ప్రభుత్వాన్ని స్పందింపచేశారు. ఈ వాస్తవాలను, విభజనకు- వికేంద్రీకరణకు మధ్య ఉన్న మౌలికమైన తేడాను, అధికార వికేంద్రీకరణ అవసరాన్ని తెలంగాణ ప్రజలు కూడా గుర్తిస్తున్నారు.

### 6. వారసులకు కాదు.. సామాన్య, మధ్యతరగతికి ఎన్నికలలో టికెట్లు

మిగిలిన పార్టీలు సొంత ఆస్తులుగా మారిపోయి నేతల వారసులే ఆ పార్టీల అభ్యర్థులుగా ఉంటుండగా, లోక్‌సత్తా వల్లే అనేకమంది సామాన్య, మధ్యతరగతి ప్రజలు 2009 అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో నిలబడగలిగారు. ఎస్సీలకు కాకుండానే దాదాపు 100మంది బీసీలకు లోక్‌సత్తా పార్టీ టికెట్లిచ్చింది. సమర్థులు ముందుకొస్తే బలహీనవర్గాలకు జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ సీట్లు కూడా ఇవ్వటానికి సిద్ధమని ప్రకటించింది. కాంగ్రెస్, తెలుగుదేశం వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా లోక్‌సత్తా 2008లో ఖైరతాబాద్, తెర్లాం నియోజకవర్గాలలో పోటీకి దిగి సుమారు 12 శాతం ఓట్లు సాధించింది. కనీస అర్హతలున్నవారు ఏ కుటుంబంలో, ఏ కులంలో పుట్టినా లోక్‌సత్తా వేదికగా ఎన్నికలలో పోటీచేయవచ్చని, ప్రజాస్వామ్యయుతంగా రాజకీయాల్లో ఏ స్థాయికైనా చేరుకుని సేవలందించవచ్చని ఆచరణలో చూపింది.

### 7. డబ్బు, మద్యం పంచకుండా,
### నేరచరితులకు టికెట్లివ్వకుండా ఎన్నికలలో పోటీ

లోక్‌సత్తా రాజకీయాలలో ఉండబట్టే డబ్బు, మద్యం పంపిణీ ఎన్నికలలో చర్చనీయాం శాలుగా ముందుకొచ్చాయి. విధానాల ప్రాతిపదికన తప్ప గెలుపు ఓటములు ప్రాతిపదికగా పొత్తులు పెట్టుకోబోమని ప్రకటించిన లోక్‌సత్తా... ఆ మేరకు ఒంటరిగానే 2009 ఎన్నికల బరిలోకి దిగింది. వీటిని యథేచ్ఛగా పంపిణీ చేస్తూ తన కంటే వందల రెట్లు ఖర్చుపెడుతున్న పార్టీలను కేవలం

ప్రజల్ని తలెత్తుకుని జీవించేలా చేసే తన ఎజెండా బలంతో ('50 గ్యారంటీలు'గా లోక్‌సత్తా వీటిని ప్రజలకు అందించింది) లోక్‌సత్తా రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంది. డబ్బు, మద్యం పంపిణీ చేయబోమని అన్ని పార్టీలూ ప్రకటించాలని లోక్‌సత్తా చేసిన సవాలుకు ఏ ఒక్క పార్టీ స్పందించలేదు. ఉద్యమంగా ఎన్నికలలో నేరచరితుల వివరాలను బైటపెట్టిన లోక్‌సత్తా ఆ విలువను ఆచరణలో చూపింది. నేరచరితులెవ్వరికీ టికెట్లివ్వని పార్టీ లోక్‌సత్తా ఒక్కటేనని 2009లో ఎలక్షన్ వాచ్ ప్రకటించింది. ప్రజలు మరింత మెరుగైన అభ్యర్థిని ఎంచుకునే అవకాశం కల్పించేందుకు వీలుగా అభ్యర్థి ఎంపికకూ ప్రాథమిక ఎన్నికలు నిర్వహించాలన్న పార్టీ విధానానికి అనుగుణంగా పటాన్‌చెరువు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓపెన్ ప్రైమరీని నిర్వహించింది. కనీస ఏకాభిప్రాయం లేని నియోజకవర్గాలతో మొదలుపెట్టి ఈ ప్రైమరీలను క్రమంగా విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్నికల వ్యయాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంతో ప్రజలకు పార్టీ విడుదల చేసింది. ఈవేళ దేశవ్యాప్తంగా అనేకమంది కోరుతున్న ఎన్నికల సంస్కరణలను లోక్‌సత్తా ఆచరణలో చూపుతోంది.

### 8. అసెంబ్లీలో గళం... మోడల్ నియోజకవర్గంగా కూకట్‌పల్లి

తాను ఎన్నికలలో పోటీచేస్తే డిపాజిట్ కూడా రాదని అన్నా హజారే లాంటి వ్యక్తి సైతం వ్యాఖ్యానిస్తున్న తరుణంలో... డబ్బు, మద్యం పంపిణీ, ఆర్భాటాలు లేకుండా కేవలం విలువలు, విధానాలకు కట్టుబడి పోటీచేసిన జేపీని తీవ్ర ప్రతికూల పరిస్థితులలో సైతం శాసన సభ సభ్యునిగా గెలిపించటం ద్వారా కూకట్‌పల్లి ప్రజలు యావత్ భారతదేశానికే ఆదర్శంగా నిలిచారు. వారితోపాటు అన్ని ప్రాంతాల ప్రజల ఆశలను, నమ్మకాన్ని నిలబెడుతూ జేపీ 2009 నుంచి అసెంబ్లీలో అత్యున్నత ప్రమాణాల చర్చలకు కేంద్రబిందువుగా మారారు. సభ ఔన్నత్యాన్ని పెంచారు. వాకౌట్ల కన్నా వాదనలే మిన్న అని నిరూపించారు. లేచి నిలబడి నిరసనలు తెలిపారు తప్ప ఏనాడూ  జేపీ వాకౌట్ చేయలేదు. సభాసమయాన్ని వృథా చేయ లేదు. సహకార సంఘాలను దెబ్బతీసే చట్టానికి వ్యతిరేకంగా, రాష్ట్రంలోని వ్యవసాయ సంక్షోభంపై, తీరప్రాంతాన్ని కబ్జా చేయటంపై, 14 (ఎఫ్) తొలగింపుపై, రిజర్వేషన్లపై, కూకట్‌పల్లి, హైదరాబాద్ సమస్యలు... ఇలా దాదాపు ప్రతి అంశంపై ఆయన చేసిన ప్రసంగాలు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. చాలా సాధికారికతతో, నిర్దిష్ట సాక్ష్యాధారాలు చూపుతూ, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసేలా జేపీ మాట్లాడారు. ఓబుళాపురం గనుల అక్రమాలపై చర్చ జరిగినప్పుడు... గనులు మీవాళ్లకు కాదు, మావాళ్లకే కేటాయించాలి అనే తీరుగానే కాంగ్రెస్, తెలుగుదేశం వాదించుకుంటుంటే, అలాంటి చర్చతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని, ప్రకృతి వనరుల్ని బహిరంగ పోటీ వేలం ద్వారా కేటాయించి ప్రభుత్వ ఖజానాకు లాభం చేకూర్చేలా విధానాలు మార్చటం ద్వారానే ప్రజాప్రయోజనాలను పరిరక్షించగలమని జేపీ ఒక్కరే స్పష్టంచేశారు. అలాగే అప్పనంగా వచ్చిన లాభాల మీద విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ పన్ను ఎందుకు వేయటం లేదని నిలదీశారు. కేజీ బేసిన్ గ్యాస్‌ను రాష్ట్రప్రయోజనాలకు వినియోగించుకునేందుకు వీలుగా గ్యాస్ గ్రిడ్‌ను నిర్మించకుండా తెలుగు దేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు కాలక్షేపం చేసిన తీరును జేపీ ఎండగట్టారు. తెలంగాణ సమస్యపై కూడా చర్చించి సభ ద్వారా ఓ పరిష్కారం సాధించుకుందామని జేపీ పట్టుపట్టినా ప్రధాన పార్టీలు కలిసిరాలేదు. లోక్‌సత్తాకు 15 శాతం ఓట్లు, 10 సీట్లు వస్తే రాష్ట్ర రాజకీయం భిన్నంగా ఉండేదని ఇప్పుడు చాలామంది అంటుండటం అసెంబ్లీలో పార్టీ ప్రభావానికి చిహ్నం. అలాగే కూకట్‌పల్లిలో రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలో జరగనంతస్థాయిలో సుమారు రూ.700 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అవినీతికి, కబ్జాలకు, ఎమ్మెల్యేరాజ్యానికి ఆస్కారం లేకుండా స్థానిక స్థాయి నుంచీ మెరుగైన సేవలు ప్రజలకు అందేలా, పాఠశాలలు, వైద్యశాలలు పటిష్టంగా పనిచేసేలా, ప్రజల్లో సామరస్యం పెంపొందేలా స్థిరమైన అభివృద్ధిని అందిస్తూ కూకట్‌పల్లిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు జేపీ కృషి చేస్తున్నారు. అభివృద్ధిపనుల్లో రాజకీయాలకతీతంగా అందరినీ భాగస్వాముల్ని చేస్తున్నారు. స్థానిక ప్రభుత్వాలపై ఎమ్మెల్యేల పెత్తనాన్ని వ్యతిరేకించే లోక్‌సత్తా విధానంలో భాగంగా జీహెచ్ఎంసీ మేయర్ ఎన్నిక ఎక్స్‌అఫీషియో ఓటింగ్‌లో జేపీ పాల్గొనలేదు. కూకట్‌పల్లిలో లోక్‌సత్తా పార్టీ ఎన్నికయ్యాక చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను "కూకట్‌పల్లి నౌ.కామ్" వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అలాగే **కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం మాట్లం గ్రామంలో డిసెంబర్, 2010లో జరిగిన వార్డు ఉప ఎన్నికలో డబ్బు, మద్యం పంచకుండా, కుల, మతాలకతీతంగా లోక్‌సత్తా  పార్టీ తరుపు అభ్యర్థి తిరుమాను శేషమ్మ... కాంగ్రెస్ బలపరిచిన తెలుగుదేశం అభ్యర్థి మీద విజయం సాధించి లోక్‌సత్తా కొత్త రాజకీయం సత్తాని చాటారు.**

### 9. పోస్టాఫీసులలో ఓటర్ల నమోదు

ఓటుహక్కు వినియోగంపై ప్రజలను ఎంతో చైతన్యం చేయటంతోపాటు లోక్‌సత్తా చేసిన పోరాట ఫలితంగానే 2008లో

పోస్టాఫీసులలో ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది.

### 10. గ్రామన్యాయాలయాలను సాధించటం

ప్రజల వద్దకే న్యాయాధికారులు వెళ్లి, కేసులలో ఆధారాల సేకరణ, విచారణ, తీర్పును అక్కడికక్కడే ఇచ్చే చరిత్రాత్మక గ్రామ (స్థానిక) న్యాయాలయాల చట్టం కోసం లోక్‌సత్తా కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటాన్ని పార్టీగా మరింత తీవ్రతరం చేసి ఎట్టకేలకు 2008-09లో ఆ చట్టాన్ని సాధించింది. దీనివల్ల సామాన్యులకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం అంది వారు సామాజికాభివృద్ధిలో, సంపద సృష్టిలో భాగస్వాములు కాగలుగుతారు. కేంద్రప్రభుత్వం తోడ్పాటు ఇస్తోంది కాబట్టి రాష్ట్రంలో కూడా వెంటనే స్థానిక కోర్టుల్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రికి జేపీ లేఖలు రాసి ఒత్తిడి తేవటంతోపాటు పాటు అసెంబ్లీలో  కూడా గట్టిగా వాదించారు.

### 11. ప్రజాస్వామ్యయుతంగా పార్టీ నిర్మాణం

అర్హత ఉంటే పార్టీలో ఎవరైనా ఏ స్థాయికైనా ఎదగగలిగేలా ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పార్టీ అధ్యక్షుడితో సహా వివిధస్థాయిల్లో కీలక పదవులను భర్తీచేసిన తొలిపార్టీ దేశంలో లోక్ సత్తాయే. పార్టీని స్వయంపోషకం చేసుకుంటూ ఈ ఎన్నికలను మరింత పకడ్బందీగా నిర్వహిం చేందుకు నూతన సభ్యత్వ విధానాన్ని పార్టీ చేపట్టింది. పార్టీ ఆదాయవ్యయ వివరాలను వెబ్ సైట్‌లో ప్రపంచవ్యాప్తంగా అందరికీ అందుబాటులో ఉంచిన తొలి పార్టీ దేశంలో లోక సత్తాయే. ఎంపికచేసిన చోట్ల పార్టీ కార్యాలయాలను పౌరసేవా కేంద్రాలుగా మార్చి వివిధ ప్రభుత్వ సేవల్ని, ఇతర సహాయాల్ని ప్రజలకు వేగంగా అందుబాటులోకి తెచ్చే కృషి కొనసాగుతోంది.

### 12. కొత్త రాజకీయ సంస్కృతి

మద్యం బెల్టుషాపులకు వ్యతిరేకంగా చేసినా, అవినీతికి వ్యతిరేకంగా చేసినా, భవనాల క్రమబద్ధీకణ జీవోలకు వ్యతిరేకంగా చేసినా, మంచినీటి కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై చేసినా, కేపీహెచ్‌బీ కాలనీ పేరు మార్పునకు వ్యతిరేకంగా చేసినా, విజయనగరంలో జిందాల్ ఫ్యాక్టరీ నిర్మాణం పేరుతో రైతులకు జరిగిన అన్యాయంపై చేసినా, అసంబద్ధ థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి వ్యతిరేకంగా చేసినా, మున్సిపాలిటీలలో స్థానిక సమస్యలపై చేసినా... లోక్‌సత్తా ఎక్కడా రాస్తారోకోలు, సార్వత్రిక బంద్‌లతో ప్రజల్ని ఇబ్బంది పెట్టి ప్రజల ఆస్తికి నష్టం చేసే పద్ధతులలో చేయలేదు. రాజ్యాంగబద్ధంగా 'సృజనాత్మక ఒత్తిడి' పంథాతో పాలకపక్షాన్ని ప్రజాప్రయోజనాల వైపునకు తిప్పేందుకు పోరాడింది. ప్రజల్లో ఆలోచనను పెంచి చైతన్యవంతుల్ని చేసేందుకు కృషి చేసింది. ప్రచారంలో కూడా ఎక్కడా ఆర్భాటాలు, జనాన్ని ప్రలోభపెట్టి సభలకు తరలించటం లేకుండా చాలా సీదాసాదాగా, హుందాగా ప్రజలను చేరింది. 2007లో శ్రీకాకుళం జిల్లాలో 800 కిలోమీటర్ల మేర లోక్‌సత్తా నేతల బృందం పాదయాత్ర చేసి సుమారు 600 గ్రామాలలో పార్టీ జెండాను ఎగురవేశారు. వారికి కావలసిన అవసరాలన్నిటినీ స్థానికంగా ఎక్కడికక్కడ ప్రజలే చూసుకున్నారు. అదే సంవత్సరం జేపీ ఓ సాధారణ వ్యాను మీదే (అంతకుముందు లోక్‌సత్తా సమకూర్చిన ఈ వాహనాన్నే అన్నా హజారే మహారాష్ట్రలో తన ప్రచారానికి వినియోగించుకున్నారు) వివిధ జిల్లాలో జన రాజకీయ యాత్ర చేసి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను, డిమాండ్లను ఎక్కడికక్కడ తెలుసుకున్నారు.

2009 ఎన్నికల ప్రచారాన్నే చూస్తే...  స్వాతంత్ర్యానికి పూర్వం మహాత్మాగాంధీ చేసినట్టు సాధ్యమైనంత తక్కువ ఖర్చు, ప్రజలకు తక్కువ అసౌకర్యం మాత్రమే ఉండేలా ప్రజారవాణా సాధనమైన రైలును, మీడియాను జనంలోకి వెళ్లటానికి లోక్‌సత్తా వినియోగించుకుంది. అదనంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంది. బహిరంగ చర్చలలో ఏమాత్రం వ్యక్తిగత దూషణలు లేకుండా హుందాగా కేవలం విషయం మీద లోతైన పరిజ్ఞానంతో, సాక్ష్యాలతో మాత్రమే మాట్లాడింది. లోక్‌సత్తా పోరాటం వ్యక్తుల మీద కాదు, వ్యవస్థల పైనే, వాటిని మార్చటం కోసమే. **గత ఐదేళ్ల మీడియా రికార్డుల్ని బయటికి తీస్తే... అత్యధికంగా ప్రజాసమస్యల మీదే స్పందించిన పార్టీగా లోక్‌సత్తాయే తేలుతుంది.** ఏవైనా నిర్దిష్ట విమర్శలకు సమాధానం చెపాల్సివచ్చినప్పుడు మాత్రమే లోక్‌సత్తా ఇతర పార్టీలపై, వ్యక్తులపై పేర్లు పెట్టి విమర్శిస్తుంది. పోటాపోటీ విధ్వంసాలతో, విద్వేష రాజకీయాలతో విసిగిపోతున్న ప్రజలను ఈ రాజకీయ సంస్కృతి ఆలోచింపజేస్తుండటం వల్ల ఇతర పార్టీలు కూడా ప్రభావితమవుతున్నాయి. బంద్‌లు వద్దని బలంగా మాట్లాడే గొంతుల సంఖ్య పెరిగింది.

### 13. మద్యనియంత్రణ

మద్యం నుంచి రాష్ట్రానికి విమోచన కలిగిస్తామని మేనిఫెస్టోలలో ప్రకటించి, స్వర్ణాంధ్రప్రదేశ్, హరితాంధ్రప్రదేశ్‌ను నిర్మిస్తామని

బాకాలూదుకుని అందుకు విరుద్ధంగా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన తెలుగుదేశం, కాంగ్రెస్ బూటకపు విధానాలను లోక్‌సత్తా ప్రజలలోకి తీసుకెళ్లింది. ఆ రెండు పార్టీల నేతలూ మద్యం సిండికేట్లుగా ఏర్పడిన తీరును బైటపెట్టింది. ప్రభుత్వమే చట్టవిరుద్ధంగా బెల్టుషాపుల్ని ప్రోత్సహిస్తున్న తీరునూ వెల్లడించింది. మద్యాన్ని ప్రభుత్వం ఆదాయమార్గం చేసుకోకుండా కఠిన మద్యనియంత్రణ అమలు చేసి గ్రామాలను మద్యం బారి నుంచి విముక్తం చేయాలని మహిళాసత్తా నేతలు శ్రీకాకుళం నుంచి రాష్ట్రవ్యాప్త ప్రచారయాత్ర చేశారు. గుంటూరు జిల్లాలో జేపీ మూడురోజులు పాదయాత్ర చేశారు. 2010లో మద్యం వేలంపాటల్ని అడ్డుకున్న పార్టీ లోక్‌సత్తా మాత్రమే. మద్యం వల్ల ప్రభుత్వానికి వస్తున్న ఆదాయంకంటే మద్యం వల్ల కలుగుతున్న ఆరోగ్యనష్టాలతో ప్రజలకవుతున్న వ్యయమే ఎక్కువని కేంద్ర ఆరోగ్యమంత్రి వరకూ లెక్కలతో సహా తీసుకెళ్లింది. మద్యనియంత్రణను సాకారం చేసేందుకు లోక్‌సత్తా నిలకడగా ప్రజలలోకి తన పోరాటాన్ని తీసుకెళ్తోంది.

**14. కులనిర్మూలన దిశగా రిజర్వేషన్లు**

వివక్షల తొలగింపునకు రిజర్వేషన్లను పెంచుకుంటూ పోవటం పరిష్కారం కాదని, ఉన్న రిజర్వేషన్లను అమలు చేస్తూనే నాణ్యమైన విద్య, ఉపాధి నైపుణ్యాలు, అవకాశాలను అందరికీ పూర్తి ఉచితం చేయటంతోపాటు పేదరికం, గ్రామీణ నేపథ్యం ఉన్నవారికి పోటీపరీక్షలలో అదనపు మార్కులు కలిపే ఏర్పాటు చేయటం, రాజకీయ ప్రాతినిధ్యం లభించటం కోసం దామాషా ఎన్నికల విధానం తీసుకురావటం అవసరమని లోక్‌సత్తా మాత్రమే గళం విప్పింది. ఈ అంశం మీద ఇలా మాట్లాడే సాహసం దేశంలో ఏ పార్టీ చేయలేదు. కాపులను బీసీలలో కలిపి కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాన్ని 2007లో లోక్‌సత్తా గట్టిగా అడ్డుకుంది. అలాగే దళిత క్రైస్తవుల్ని, ముస్లింలను ఎస్సీలుగా గుర్తించటంపై కూడా స్పష్టంగా అభ్యంతరాల్ని చెప్పటంతోపాటు వారి ప్రయోజనాలు కాపాడటానికి ఆచరణసాధ్యమైన పరిష్కారాల్ని కూడా తెలియచేసింది. రిజర్వేషన్లనే ఉపశమనం చుట్టూనే రాజకీయంచేస్తూ, అణగారిన వర్గాలను దెబ్బతీస్తున్న పార్టీల దుర్మార్గాన్ని ఎండగడుతూ లోక్‌సత్తా చేస్తున్న పోరాటానికి నెమ్మదిగానైనా ప్రజలు గుర్తిస్తున్నారు. అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యానికి ప్రత్యేకంగా సర్వజనసత్తాను కూడా ఏర్పాటు చేసి వారి రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు కృషిచేస్తోంది.

**15. చట్టబద్ధ పాలన**

తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు, చట్టం ముందు అందరూ సమానమే అని లోక్‌సత్తా ఓ రాజకీయ పార్టీగా కూడా వాదిస్తూ నిలబడింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు చట్టబద్ధ పాలన కీలకమని, ఇందుకోసం పోలీసుశాఖలో రాజకీయ జోక్యంలేకుండా సంస్కరణలు చేపట్టాలని గట్టిగా పోరాడుతోంది. నిషేధాజ్ఞల్ని ఉల్లంఘించి 2010లో అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య ధర్నా చేస్తే ఎందుకు అరెస్టు చేయలేదని పార్టీ ప్రశ్నించింది. అసెంబ్లీలోనూ వివిధ సందర్భాలలో చట్టబద్ధ పాలనతో సామాన్యుడి రక్షణ కోసం గట్టి వాదనల్ని వినిపించింది. పార్టీ తన ప్రతి కార్యక్రమాన్నీ చట్టబద్ధంగా మాత్రమే ఉండేలా చేస్తూ ఆచరణలో చూపుతోంది. కుంభకోణాల్లో కొందరు ప్రముఖులు సైతం జైళ్లకెళ్తుండటం, తరచూ శాంతిభద్రతల సమస్యలు జనజీవితాన్ని దెబ్బతీస్తుండటంతో ఇప్పుడిప్పుడు విధిలేక అన్ని పార్టీలూ చట్టబద్ధపాలన తేవాలని మాట్లాడుతున్నాయి. అయితే కేవలం బలమైన చట్టాలు, వాటి సరైన అమలుకే పరిమితం కాకుండా చట్టబద్ధ పాలన కోసం చేపట్టాల్సిన బహుముఖ చర్యల కోసం కూడా లోక్‌సత్తా పోరాడుతోంది. కేంద్రీకృత పాలన, పేదరికాన్ని కొనసాగించే ఇతర విధానాల వల్ల నైపుణ్యాలు లేకుండా పొట్ట చేతబట్టుకుని నగరాలకు వలసలు వచ్చేవారి సంఖ్య పెరిగిపోతూ నేరాలు కూడా విచ్చలవిడి అయిపోయాయి. అందుకే అధికారాన్ని వికేంద్రీకరించి, స్థానికంగా చిన్న పట్టణాల అభివృద్ధితో ఉపాధి అవకాశాల్ని అందించటాన్ని, న్యాయసంస్కరణలు తీసుకురావటాన్ని కూడా లోక్‌సత్తా పార్టీ తన ఎజెండాలో కీలకాంశాలుగా చేసుకుంది.

**16. వరదసాయంలో ప్రభుత్వానికే ఆదర్శంగా..!**

2009లో కృష్ణానది వరద తాకిడికి గురైన ప్రాంతాలలో పునర్నిర్మాణానికి ప్రభుత్వం ఇటుక కూడా పేర్చకముందే మహబూబ్‌నగర్, కర్నూలు, గుంటూరు, కృష్ణా జిల్లాలలో లోక్‌సత్తా పార్టీ దత్తత తీసుకున్న నాలుగు గ్రామాలలో పాఠశాల, మంచినీటి పథకం, కమ్యూనిటీ హాలు, ఎత్తిపోతల పథకాలు ప్రారంభమయ్యాయి.

**17. నాయకత్వ శిక్షణ**

రాజకీయాలకు పూర్తిగా ప్రజల్నే కేంద్రబిందువుగా చేసి లోక్‌సత్తా పార్టీ చేస్తున్న కృషిని ఇంతకు ముందు ఏ పార్టీ చేసిన నమూనా

లేదు. అందువల్ల ఈ కొత్తరాజకీయానికి కావలసిన నాయకులను, ఆ భావజాలం ప్రతినిధులను పెద్దఎత్తున తయారుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం విస్తృతంగా పార్టీ సాహిత్యాన్ని అందుబాటులోకి తేవటంతోపాటు శిక్షణా తరగతులను కూడా నిర్వహిస్తూ వస్తోంది. విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో ఈ తరగతుల్లో పాల్గొంటూ దేశ భవిష్యత్తుకు మేమున్నామంటూ భరోసా ఇస్తున్నారు. దేశంలోనే మొదటిసారిగా రాజకీయ శిక్షణకు లోక్‌సత్తా పార్టీ ఏర్పాటుచేసిన ప్రజాస్వామ్య శిక్షణాసంస్థ కొత్త రాజకీయ సంస్కృతి, విధానాలపై పార్టీ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాల్ని కొనసాగిస్తోంది.

**18. ఇతర రాష్ట్రాలలో, దేశాలలో కూడా ..**

ఆంధ్రప్రదేశ్ నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు లోక్‌సత్తా పార్టీ విస్తరించింది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్, జర్మనీ, న్యూజిలాండ్, స్వీడన్, స్విట్జర్లాండ్ దేశాలలో లోక్‌సత్తా రాజకీయ విధానాలతో **పీపుల్ ఫర్ లోక్‌సత్తా (పీఎఫ్ఎల్)** అనే సంస్థ స్వచ్ఛందంగా పనిచేస్తోంది. భారతదేశంలో అవినీతికి వ్యతిరేకంగా పీఎఫ్ఎల్ ప్రతినిధులు అమెరికాలో 240 మేళ్ల మేర చేపట్టిన దండియాత్ర-2 ప్రవాస భారతీయులలో మంచిస్పందనను తెచ్చింది. 2010 వేసవిలో 'భారత్‌కు నూతనోత్తేజం' పేరుతో కనెక్టికట్ నుంచి సెయింట్ లూయిస్ వరకు అమెరికాలోని వివిధ నగరాల్లో నెలరోజుల పాటు నిర్విరామంగా జరిగిన ప్రచార కార్యక్రమంలో దాదాపు 50 సమావేశాల్లో జేపీ పాల్గొన్నారు. వేలసంఖ్యలో ప్రవాస భారతీయులను, ముఖ్యంగా ఎన్నారై యువతను ప్రత్యక్షంగా, పరోక్షంగా కలుసుకున్నారు. భారతదేశాన్ని అగ్రరాజ్యంగా తీర్చిదిద్దటానికి కొత్త రాజకీయం అవసరాన్ని, పాలనాప్రక్షాళన ఆవశ్యకతను వివరించారు. భారత్ తరపున అమెరికాలో ప్రవాస భారతీయుల మధ్య ఇంత పెద్దఎత్తున రాజకీయ భావజాల ప్రచారం చేయటం ఇదే తొలిసారి. *(ఈ సమీక్ష విహంగ వీక్షణం కాబట్టి... ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు చేపట్టిన కార్యక్రమాలను ఇందులో ప్రస్తావించటం సాధ్యం కావటం లేదని గమనించగలరు).*

రాజకీయ వాతావరణం తీవ్ర ప్రతికూలంగా ఉన్నా, మీడియా సహకారం ఉండాల్సినంత లేకపోయినా... లోక్‌సత్తా పార్టీ విధానాలు ప్రజల్లో నిగ్గుతేలాయి. **రాజకీయాలలో లోక్‌సత్తా పార్టీ ఉనికి అవసరమని, ఏదోఒక మార్పు కాకుండా వ్యవస్థలో సరైన మార్పు తేవటానికి ఆ పార్టీ విధానాలు తప్ప వేరేమార్గంలేదని ఈవేళ దాదాపు అందరూ అంగీకరిస్తుండటంతో లోక్‌సత్తా పార్టీ జనంలో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకుందని చెప్పవచ్చు.** ప్రజల చుట్టూ తిరిగే కొత్త రాజకీయానికి, వ్యవస్థలో ఓ మౌలిక మార్పునకు గట్టి పునాది మాత్రం పడిందనటంలో సందేహం లేదు. ఏ అంశం గురించైనా లోక్‌సత్తా వాదన, కార్యాచరణ ఏమిటి అని ఎక్కువ శాతం ప్రజలు చూస్తున్నారు. రాజకీయాల గౌరవాన్ని, విశ్వసనీయతను పెంపొందించటంలో పార్టీ సఫలమైంది. దీన్ని క్రమంగా ఎన్నికల ఫలితాలుగా మార్చుకోవాల్సిన తరుణం ఆసన్న మైంది. లోక్‌సత్తా పార్టీకి 2009 అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలో సుమారు 1.8శాతం ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికలలో సీట్లు రాకపోయినా పోలింగ్ శాతానికి నైష్పత్తికంగా చూస్తే అదే ఓటింగ్ శాతం కొనసాగింది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఓట్లు, సీట్లు పెంచుకోవటం తప్పనిసరి. పార్టీ రాజ్యాంగంలో పొందుపరుచుకున్న మౌలిక సూత్రాల విషయంలో ఏమాత్రం రాజీపడకుండా, గాలుల తాకిడికి కొట్టుకుపోకుండా, మిణుగురు పురుగుల కాంతిని అనుసరించకుండా, సుదూర, స్థిర నక్షత్రకాంతి బాటలో ప్రయాణిస్తూ, ఆ లక్ష్యసాధనకు సాధనంగా అధికారాన్ని సాధించుకునేందుకు సిద్ధమవ్వాలి. ఇందుకోసం పార్టీకి స్థానికంగా ఎక్కడికక్కడ సమర్థవంతంగా, నిబద్ధతతో, కొంత అవగాహనతో, సృజనాత్మకతతో, వనరులు సమకూర్చుకుంటూ నిలకడగా పనిచేసే సహజ నాయకత్వం కావాలి. ముఖ్యంగా యువత, రైతులు, మహిళలు, మధ్యతరగతి ఇందుకు కదలాలి. రాష్ట్రంలో, దేశంలో లోక్‌సత్తా పార్టీ విజయానికి కావలసిన అనుకూల వాతావరణం నెలకొంటోంది. **చంకలో బిడ్డని పెట్టుకుని ఎక్కడెక్కడో వెతకాల్సిన పన్లేదని రాష్ట్రంలో, దేశంలో ప్రజలు గుర్తించే రోజు కూడా తప్పక వస్తుంది.**

**లోక్‌సత్తా పార్టీ వార్షికోత్సవ శుభాకాంక్షలతో...**

(అక్టోబర్, 2011)